
# నవ్వు మొహం

రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు

ఎమెస్కో

# ఇంతే సంగతులు


| | | |
|---|---|---|
| 1. | పిచ్చి వేషాల కథ | 9 |
| 2. | సాహితీ 'గురునాదం' లేదా ఓ 'నవలా' మణి కథ | 15 |
| 3. | విద్యారామం అను బై ఫోర్సు ఎం.పీ.లు | 20 |
| 4. | వ్యథామురళి అను దురదృష్టపంతుళ్ళ కథ | 26 |
| 5. | కాన్వెంటు గోపాలం అను ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్లు | 32 |
| 6. | శబ్ద బ్రహ్మం | 38 |
| 7. | గొప్ప స్క్రిప్టు బాబూ! | 44 |
| 8. | అశాంత స్వర్గం | 50 |
| 9. | సినీ వివేకం | 55 |
| 10. | ఎలక్షన్ వి'శేషన్లు' | 61 |
| 11. | ఆర్థిక నేను | 66 |
| 12. | పునర్నవం | 71 |
| 13. | అనారోగ్య భాస్కరం | 77 |
| 14. | బ్లో – అవుట్లు | 83 |
| 15. | వాహనా చలపతి | 88 |
| 16. | ధూమకాసురులు | 94 |
| 17. | ఓ స్పాట్‌లెస్ పంతులు కథ | 101 |
| 18 | మామిడికాయల సంత | 106 |
| 19. | జోడు కుదిరిన వేళ. . . | 111 |
| 20. | నామకరణం | 118 |
| 21. | వేలు (నాటిక) | 124 |




# పిచ్చివేషాల కథ

"నేను వేషం వెయ్యను. వెయ్యనని నిన్నా మొన్నా కూడా చెప్పాను. అదలా ఉంచు. నాటికా? మన శాల్తీలను పెట్టుకునా? బొత్తిగా అనుభవం లేక ఇలా ఉత్సాహపడిపోతున్నావు గాని వీళ్ళందరితోనూ స్టేజెక్కితే ఏమౌతుందో ఎలా ఉంటుందో తెలుసా? నే చెబుతా కూచో.... సర్దుక్కూచో మరి. ఇదోగాథ" అని ప్రసాదం, రామారావు అనే కుర్రకొలీగ్‌కి ఇలా చెప్పడం మొదలుపెట్టాడు.

అప్పుణ్ణేను ఇంటరు చదువుతున్నాను. నేనూ, ఫకీరని మరో కుర్రాడూ శ్రీరామ నవమికి మా వూరిపందిట్లో ఓ నాటిక వేద్దామని అనుకున్నాం. మా వూరి ప్రజలకు అనువుగా ఉండే నాటిక ఒకటి పొరుగూరి లైబ్రరీ అంతా గాలించి పట్టుకొని, పాత్రధారుల్నీ తదితరుల్నీ సమకూర్చుకోవడం ప్రారంభించాం.

తదితరులు అంటే ఒక్కడే. దర్శకుడు. మాకు ఒక దర్శకుడు కావాలి కదా! ఒకాయన దొరికాడు. ఆయన మాకు దొరకడం ఏమిట్లే, మేమే ఆయనకు దొరికిపోయాం. మా ఊళ్ళో ఏముందీ నాలుగుసార్లు స్టేజెక్కితే – ఆ ఎక్కడం విరాళాలిచ్చిన దాతలపేర్లు చదవడానికి ఎక్కినాసరే సీనియరై పోతాడు. అలాంటి సీనియర్లు ముగ్గురున్నా దర్శకుడయ్యే అర్హత మాత్రం ఈయనకే ఉంది. ఎంచేతంటే ఈయనకే పనీ లేదు. రోజంతా ఖాళీ. ఈయన దాతల పేర్లు చదివి సీనియరై పోయినవాడు కాదు. పాపం–కొన్ని వేషాలు వేశాడు. అప్పట్లో ఆయనకి ఆస్తిపాస్తులుండేవి. అవి ఆరిపోయాక ఏ వేషాలూ వెయ్యకుండా ఊరిపట్టునే ఉంటున్నాడు.

మా రిహార్సల్స్ గుళ్ళో జరిగేవి. బోలెడు ఖాళీ స్థలం. అయితే రిహార్సల్స్ మొదలయ్యాక కూడా అది ఖాళీగానే ఉండేది. చూడ్డానికి జనం రావడం లేదని కాదు చెప్పేది. అసలు నాటకం నేర్చుకోవాల్సిన జనమే లోటౌతూ ఉండేవారు. వాళ్ళందర్నీ పోగుచెయ్యాల్సిన బాధ్యతనాది. అదెంత ఖర్మో అనుభవిస్తే గాని తెలీదు.

అసలు నటుల్ని ఎన్నుకోవడం దగ్గరే మొదలైంది నాకు సమస్య. మాది పల్లెటూరు. చదువుకున్న జనం చాలాచాలా తక్కువ. మా నాటికలో ఏడు పాత్రలున్నాయి. అంతమంది అక్షరాస్యులు మాకు దొరకలేదు. ఎందుకంటే అక్షరాస్యులందరూ స్టేజీ ఎక్కలేరు. కొందరికి జనాన్ని చూసేసరికి అతిశైత్యం పట్టుకుంటుంది. అంచేత ధైర్యమూ, ఏక్షను చెయ్యగలమన్న ప్రగాఢమైన అపోహా, నీకులాగా ఉత్సాహమూ ఉన్న కుర్రకారుని నిరక్షరాస్యుల్లోంచి కూడా ఏరాం. అర్జున అని ఒక కుర్రాడిని ఒడ్డూ పొడుగూ ఆన్తాడు కదాని ఇనస్పెక్టర్ వేషానికి తీసుకున్నాం. "డైలాగ్‌లు చెప్పలేను. యాక్షన్ మాత్రం దంచేస్తా" నన్నాడు. 'యూ ఆర్ అండర్ అరెస్ట్' అనాలి ఒకచోట. ఎన్నిసార్లు చెప్పినా రాలేదు. గట్టిగా ఒత్తిడి చేస్తే మానేస్తానంటాడని భయమేసి నేనూ మా డైరెక్టర్‌గారూ ఆ మాటని తీసేశాం. అయితే 'హ్యాండ్సప్' అని ఒకచోట – అనకతప్పని పరిస్థితి అతనికీ, అతన్చేత చెప్పించక తప్పని పరిస్థితి మాకూ పడింది. ఎంతనేర్పినా కాసేపాగాక 'షటప్' అనే అనేవాడు. ఒక్క చిన్న ముక్క ఉన్నదున్నట్లు గుర్తుపెట్టుకోలేని వాడివి ఎలా బతుకుతావయ్యా అనేవాణ్ణి. నా కన్న బాగానే బతుకుతున్నాడిప్పుడు. అది వేరే కథ.

రామాంజనేయులు అని ఒక కుర్రాడున్నాడు. మా కన్నా పెద్ద. రెండు నాటికల్లో వేసి వున్నాడు. షోగ్గానే ఉంటాడు కూడా. అతణ్ణి అడిగాం నాటికలో వెయ్యమని. హీరోతప్ప వెయ్యనన్నాడు. 'హీరో రోల్‌కి అనుభవం లేని వాణ్ణి ఎక్కిస్తే నాటిక కంపు అయిపోతుంది' అన్నాడు ముక్కు మూసుకుని. ఒప్పుకున్నాం. అతను 'ఊఁ' అనడమే మహా ప్రసాదం.

నాగేశ్వర్రావని మరోకుర్రాడుండే వాడు. అతను హాస్యపాత్ర వెయ్యాలి. స్టేజి మీద ఏం చేస్తాడన్నది తర్వాత సంగతి గాని అతను వేళకి దొరక్క మమ్మల్ని చాలా ఏడిపించాడు. హీరో అయితే అసలు దొరక్క ఏడిపించాడు. 'రావయ్యా రామాంజనేయులూ' అంటే 'నాకు పనులున్నాయి.